# గలగలా గోదారి

ఖైరవ్స్

ఈ గోదారి తల్లి, అనంతమైన కథల్ని తన కెరటా లలో దాచుకుందిరా. ఆనందాన్ని, విషాదాన్నీ కూడా సమపాళ్ళలో లయం చేసుకుని, తాను మటుకు కాల రూపిణై నిర్వికారంగా సాగిపోతూనే వుందిరా. ఆ కెర టాల మధ్య పదిలంగా దాచుకున్న ఒక కన్నీటి కెరటాన్ని విప్పతాను చూడరా అబ్బాయ్.

అవధాని గారని వుండేవారులే. చిన్నప్పుడే తండ్రిని పోగొట్టుకుని ఆ కుటుంబానికి తానే పెద్ద దిక్కై, పెళ్ళయి కాపరానికెళ్ళిన అప్పగారి అచ్చట, ముచ్చట తీరుస్తూ, తల చెడిన తల్లిని, తండ్రి యిచ్చిన మడి చెక్కని పూజించుకుంటూ కాలం నెట్టుకొస్తున్నార్రా ఆయన. అబ్బాయ్ ఆ రోజుల్లో బ్రాహ్మడికి జీవనాధా రంగా నేడున్నట్లుగా వుద్యోగాలు లేవురా. నోట్లో అక్షర మ్ముక్క వుంటే, దానిని నలుగురికీ దానం చేసి, వచ్చిన తృణమో పణమో స్వీకరించడం; లేదా పెద్దలు మిగి ల్చిన భూ వసతి యేమన్నా వుంటే, దానిని కాపాడు కుంటూ సంసారాన్ని నెట్టుకురావడం అంతేరా అబ్బాయ్. అంతకు మించి మరో మార్గం లేదు. ధర్మమార్గంలో నడవదలచుకున్నవాడికీ ఆ విధంగా తాతల నుంచి సంక్రమిస్తున్న భూదేవిని కొలుచు కుంటూ, నోటికీ చేతికీ ఎడం లేదనిపించుకుంటూ రోజులు వెళ్ళమారుస్తూన్నార్రా అవధానిగారు.

ఆస్తిలో కాకపోయినా గుణంలో వున్నతులైన కుటుం బంలో పిల్లని అర్ధాంగిగా స్వీకరించారురా. వారిరువుడీ ఔన్నత్యానికీ దీటుగా ఓ కుందనపు బొమ్మ వుద యించిందిరా. నేడున్నట్టుగా ఆ రోజులలో సక్రమమైన వైద్య సదుపాయాలు లేవు కదరా అబ్బాయ్. యముడికీ జీవుడికీ మధ్య జరిగే అంతర్యుద్ధంలో జయాప జయాలు, ఆచారిగారి మాత్రలకన్నా, ఆ జీవుడి అదృష్టం మీదనే ఆధారపడి వుండేవి. అందువల్ల, పురిటిలో వాతం కమ్మి, అవధానిగారి భార్య అనంతంలో కలిసిపోయిందిరా పసిడి బొమ్మని, పుట్టెడు దుఃఖాన్ని ఆయనకి మిగిల్చి. అయినా నిలదొక్కుకున్నార్రా ఆయన.

## రాబందు నీడ

ఈ లోపున అప్పగారికి వైధవ్యం సంప్రాప్తించిందిరా అబ్బాయ్. ఆవిడకో కొడుకు. ఆవిడ భర్తకి, చెప్పకోదగ్గ ఆస్తి, పాడి పశువు లాంటి వడ్డీ వ్యాపారం వుండేవి. వాటికి దీటుగా దాయాదులూ వుండేవారు.

అప్పగారికి తల చెడి మాసం తిరక్కుండానే ఆస్తి మీద దావా వేశార్రా దాయాదులు. ఆలగోల, పాల గోలు పెడుతున్న అప్పగారికి అండగా కొండలా నిలబడి, ఆ ఆస్థిని నిలబెట్టి, వేలు చీకడం యింకా మానని మేనల్లుణ్ణే కాపాడుకుంటూ వచ్చార్రా.

ఉగ్గుపాల తోటే వడ్డీ వ్యాపారంలోని కుయుక్తుల్ని ఒంట బట్టించుకున్నాడ్రా ఆ మేనల్లుడు. అందుకే, తమ ఆస్తంతా కాజేసి తమని దిక్కులేని వాళ్ళని చేయజూస్తున్నాడని మేనమామ మీద యాగీ చేశాడ్రా. దానికి, ఆ తల్లి కూడా వంత పాడిందిరా అబ్బాయ్. అయినా, ఆయన ఖిన్నులవలేదురా. అప్పగారిది తెలియని తనమని, మేనల్లుడిది క్రూరతనమని భావించారురా. బావగారు పోయిన దగ్గర్నుంచి, పొలం మీద వచ్చిన అయివేజుని, పెరుగుతున్న వడ్డీ వ్యాపారంలో సంతత ధారగా కురుస్తున్న ధనలక్ష్మిని, ఖోషాణంలో భద్రపరు స్తూనే వచ్చార్రా ఆయన. అదంతా, ఏగానీ కూడా తీరు పోకుండా లెక్క కట్టి, పెద్దల సమక్షంలో రైటనిపించు కుని, అప్పగారికి, మేనల్లుడికి అప్పజెప్పార్రా. అంతేగాని, వాళ్ళ నిమిత్తమై తాను పెట్టిన ఖర్చు సంగతి సుతరామూ ప్రస్తావించలేదురా అబ్బాయ్.

ఆ అప్పగారే, తన కొడుక్కి ఆయన కూతుర్నిచ్చి వివాహం చేయమంటే, ఆనందంతో కళ్ళు చెమర్చు కున్నార్రా. పాల పిట్టలా పెంచుకున్న కూతుర్ని పట్టు బట్టలతో అత్తవారింటికి అంపకం పెట్టార్రా. అత్త వారింట్లో అడుగుపెట్టిన ఆడపిల్ల తిరిగి పుట్టింటికి చేర లేదురా అబ్బాయ్. అవధానిగారే వెళ్ళి చూసి వస్తుండే వారు.

అత్తవారింట్లో అడుగుపెట్టేసరికి ఆ పిల్ల వయు





'తన్మయి' ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్ త్యాగరాయ గానసభలో శాస్త్రీయ సంగీత కచ్చేరి చేసి రసజ్ఞులను అలరించిన కుమారి ఆలమూరు సుధారాణి

పెంతనుకున్నావ్. పట్టుమని పదమూడు సంవత్సరాలు నిండలేదురా. వివాహమయి ఈడొచ్చిన పిల్లని పుట్టింట వుంచుకోవడం కట్టుబాటు కాదు కనక, తొక్కుడు బిళ్ళ ఆడుకునే పిల్ల అత్తవారింట కుడి పాదాన్ని మోపిందిరా. మోపడమయితే కుడిపాదాన్ని మోపింది గానీ, విధి మాత్రం ఆ పిల్లవైపు ఎడం కన్నే తెరిచిందిరా అబ్బాయ్.

ఆహారం కోసం తప్ప సాటి జీవిని హింసించవు అడవిలో మృగాలు. తన వినోదం కోసం, అంతర్గతంగా వున్న పైశాచిక తత్వాన్ని రంజింపచేయడం కోసం సాటి ప్రాణిని హింసించడం మనిషికి ఆనందం. ఆ కోవకి చెందినవారేరా అబ్బాయ్ ఆ తల్లీ కొడుకూను.

నట్టింట అడుగు పెట్టిన కొత్త కోడల్ని, అందరి ఎదుటా అక్కున జేర్చుకుందిరా ఆ మహాతల్లి. ఆ హడావుడి సద్దుమణిగాక అడకత్తెరలో బిగించిందిరా.

సాటి మనిషిని రంజింప చెయ్యడమంటే కష్టమేమో గానీ, హింసించడానికి ఆయాసపడనక్కరలేదురా అబ్బాయ్. అనేకమైన మెళకువలున్నాయ్. అనంతమైన మార్గాలున్నాయ్. ఆ యమధర్మరాజు, ఆ నరక వాసుల్ని హింసించడానికి ఎన్ని మార్గాలు అవలంబిస్తాడో, అంతకు మించిన ప్రావీణ్యతనే గడించారురా ఆ తల్లీ కొడుకూను.

అత్త అనేసరికి పుల్లిస్తరాకు కూడా పోట్ల గిత్తలా మారుతుందిరా. మొగుడు అనేసరికి గడ్డిపోచ కూడా గడ్డ పారలా దిగడుతుందిరా అబ్బాయ్. అది అనూచానంగా వస్తున్న దిక్కుమాలిన సంప్రదాయం.

తెల్లవారగట్ల నాలుగింటికల్లా లేచి కళ్ళాపి జల్లి అలికి ముగ్గు పెట్టకపోతే అత్త విరుచుకుపడేది. తన ఇనప కౌగిలి లోంచి కదలనిచ్చేవాడు కాదు ఆ మొగుడు. లేవనందుకు అత్త తిడుతోంటే, ఏమని సమాధానం చెప్పాలో ఆ పిల్లకి తెలిసేది కాదు, సమాధానం చెపితే, "ఎదురు చెపుతావా" అంటూ ఏడు తరాలు ఏకరువు పెట్టేది. చెప్పకపోతే "ముంగిలా మాటాడవేమే" అంటూ గిద్దెడు నెత్తురు కారేలా మొట్టేది. అంతటితో ఆగకుండా కొడుకుతో చెప్పేది. ఆ కొడుకు తన చేతుల తీట వదిలించుకునేవాడు. అబ్బాయ్, ఒక విషయమేమిటి- ప్రతి విషయంలోనూ అంతరార్థాంతం జరగవలసిందే. ఒక క్షణం గడిచాక మరుక్షణం ఎలా గడుస్తుందో తెలియని అవస్థలో ఆ పిల్ల బన్నాలు పడ సాగిందిరా.

పగలంతా ఎలా గడిచినా ఒరే అబ్బాయ్, చీకటి పడుతోందనేసరికి ఆ పిల్లకి రౌరవాది నరకాలు అనుభవంలోకి వచ్చేవిరా. పగలంతా చేసిన పనుల్లో ఆ పిల్ల చేసిన తప్పుల జాబితా అంతా సావకాశంగా కూచుని కొడుకుతో చెప్పేదిరా ఆ మహాతల్లి. "ఒసేయ్ పిచ్చి ముండా ఇలా రావే" అని అతి ప్రేమగా పిలిచి, "ఎందుకే అలా చేశావ్" అంటూ తప్పుకో మొట్టికాయో, లెంపకాయో బహూకరిస్తూ జుట్టు పట్టి వెనక్కు విరుచుకుపడేలా గుంజేవాడురా. ఆ మొగుడనబడే పశువు.వెనక్కిపడిన ఆ పిల్ల నోట్లో గుడ్డలు కుక్కి ఆ చేతులు కదలకుండా బిగపట్టేదిరా ఆ తల్లి. ఆ పైన తొడల దాకా చీరను ఎగదోసి ఆ తొడల మీద రోకలి బండని వుంచి దానిమీద నిలబడేవాడురా ఆ కొడుకు. నిలబడి ఆ రోకలి బండతో అటూ, యిటూ నడిచేవాడురా. పదమూడేళ్ళ ఆ పసి చర్మం, లేత బంగారు వర్ణంలో వుండే ఆ కోమల శరీరం కమిలి నీలపు వర్ణంలోకి మారుతూ వుంటే, బాధతో ఆ పిల్ల గిలగిలలాడుతుంటే ఆ తల్లీ కొడుకుల ముఖాల్లో ఎంతటి ఆనందంరా అబ్బాయ్. అంతటితో అది ఆగేది కాదు. కదలలేని స్థితిలో వున్న ఆ పిల్లని అలాగే ఎత్తుకుని మంచం మీద నడుం విరిగేలా కుదేసి, దున్నపోతులా కుమ్ముతూ తన పురుషత్వాన్ని ప్రదర్శించేవాడురా ఆ ద్విపాద జంతువు.

కుందనపు బొమ్మలా అత్తింట అడుగుపెట్టిన పిల్ల, ఉప్పి వరుగులా తయారయిందిరా. ఒక రోజుకి, మరో రోజుకి హింసించే విధానంలో తేడా తప్ప మరే మార్పూ లేదురా.

చూడవచ్చిన తండ్రితో మనసు విప్పి మాటాడే అవకాశమే లేకపోయిందిరా ఆ అర్భకురాలికి. రాబందులా ఆ పిల్ల చుట్టూ రెక్కలు విప్పుకునే వుండేది ఆ అత్త.

ఒకసారి తండ్రి వచ్చినప్పుడు ఎలాగో ధైర్యం చేసుకుని "మామ్మని చూడాలని వుంది నాన్నా" అందిరా అబ్బాయ్ ఆ పసిది.

ఆ తండ్రి పలికే లోపునే అందుకుందిరా ఆ అత్త.

"పాపం పిల్ల అమ్మకోసం బెంగెట్టుకున్నట్టుందిరా తమ్ముడూ. చూడు ఎలా చిక్కిపోయిందో. బంగారు బొమ్మలా వుంటుందని వూళ్ళో వాళ్ళ కళ్ళన్నీ దాని మీదే. దిష్టి కొట్టిందో ఏమో" ఆ గొంతులో ఎంత అభిమానమో.

"నిజమేనే అప్పా. పిల్ల దిగాలుగా వుంది" అన్నార్రా అవధానిగారు. కూతుర్ని చూస్తూ వుంటే ఆ తండ్రి హృదయం తరుక్కుపోసాగిందిరా.

"ఓసారి ఇంటికి తీసుకువెళుదువుగానిరా తమ్ముడూ. కాస్త గాలి మారినట్టుగా వుంటుంది. ఇంకెంత పెద్ద పండుగ పట్టుమని నెల రోజులు కూడా లేదుగదా. వాడు, అదీ కలిసి వస్తారు.అది లేకపోతే ఒక్క నిమిషం కూడా నాకు తోచదురా. అమ్మ కూడా పెద్దదయిపోయిందా. మరోమనిషి బరువు వెయ్యడం నాకిష్టం లేదురా" అని తమ్ముడితో అని, "ఇంకెంతే పిల్లా. నెలరోజులోపిక పట్టు. వాడూ, నువ్వూ కలిసి వెళుదురు గాని. పండగయ్యాక వాడొచ్చేస్తాడు. ఓ నెలరోజులుండి నువ్వు వద్దువు గాని" అని అతి ప్రేమగా అందిరా ఆ దొడ్డ యిల్లాలు.

చెడు వూహించని అవధాని గారు "అలా చేద్దువు గాని తల్లీ. ఇప్పుడయితే కుప్ప నూర్పిళ్ళు అవీను. హడావుడిగా వుంటుంది" అన్నార్రా.

"అది కాదు నాన్నా" అని ఏదో అనబోయిందిరా ఆ పిల్ల.

"దాని మాటకేముందిరా తమ్ముడూ. మొదటిసారి కాపరానికి రావడం కదూ. నాకూ ఇలాగే వుండేదిలే" అంది ఆ యిల్లాలు.

అప్పగారికి ఎదురు చెప్పలేక, సమాధానపడి అవధాని గారు వెళ్ళిపోయాక యమలోకంలో అమలుపరచబడే శిక్షలన్నీ ఆ తల్లీ కొడుకుల చేతుల్లో ఒకేసారి అనుభవించిందిరా ఆ పిల్ల ఆ రాత్రి.

ఒరేయ్ అబ్బాయ్, అలసట శరీరాన్ని యిబ్బంది పెట్టడం చేత, ఆ తల్లీ, కొడుకూ ఆగిపోయార్రా.వాళ్ళ కళ్ళు అలా మూతలుపడగానే కోళ్ళు 'కొక్కొరోకో' అంటున్న సమయంలో స్వాధీనం తప్పిన శరీరాన్ని అతి కష్టంమీద గోదావరి దగ్గరికి చేర్చిందిరా. ఆ తల్లి ఆ చిట్టి తల్లిని ఆప్యాయంగా తన పయ్యెద వెనకాల దాచుకుందిరా అబ్బాయ్.

అంతటి చల్లదనం, అంతటి శాంతి మరెక్కడ లభిస్తుందిరా.

చాలా సమస్యలకి తప్పనిసరి పరిష్కారం మరణమే అవుతుందిరా అబ్బాయ్.